www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 11 ఆగస్టు 2025



వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ ఆధ్వర్యాన ప్రముఖ దాత లయన్ వేగేశ్న రామరాజు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిన్నారులకు పౌష్టికాహారం, భవిత వికలాంగుల స్కూల్‌కు స్టేషనరీ అందించారు. పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్, లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లయన్ వేగేశ్న రామరాజు పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు, వృద్ధులకు, వికలాంగులకు చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. చెన్నారెడ్డి సతీష్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ సభ్యులు వారి పెళ్లి రోజులు, పుట్టినరోజులు పది మంది ఆకలి తీర్చే విధంగా జరుపుతున్నామని, అందరూ సహకరించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో డైమండ్స్ లీడర్స్ మార్కెటింగ్ ఛైర్‌పర్సన్ లయన్ జొన్నల సతీష్ కుమార్, సెక్రెటరీ లయన్ కోటి విజయ్ కిషోర్, డైరెక్టర్స్ ఆకుల సతీష్, కన్నాజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ చేపల చెరువుపై..

చర్యలు తీసుకునేనా..!

నిడమర్రు మండలం అడవికొలనులో కబ్జా పర్వం

ప్రభుత్వ భూమి 94 సెంట్లు ఆక్రమించి దర్జాగా చేపల సాగు

పదేళ్లలో దాదాపు రూ.పది లక్షల సొమ్ము హాంఫట్

తామే ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నామని బహిరంగంగానే వ్యాఖ్యలు

చెరువులో లేని వ్యక్తి పేరుతో కరెంటు కనెక్షన్.. ప్రభుత్వ సబ్సిడీ స్వాహా

అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న రాజకీయ నేతలు

ఆక్రమిత ప్రభుత్వ భూమికి హద్దులు గుర్తింపు.. మరి చర్యలెప్పుడో

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని చేపల చెరువు తవ్వుకున్నాం. పదేళ్లుగా దర్జాగా అనుభవిస్తున్నాం. చెరువులో లేని వ్యక్తి పేరున విద్యుత్ మీటర్‌తో సబ్సిడీ పొందుతున్నాం.. అయితే మమ్మల్నే ప్రశ్నిస్తారా.. మాకు రాజకీయ అండ ఉంది. ప్రశ్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి' అంటూ అధికారులకే వినతులు ఇస్తున్న అందరినీ విస్మయపరుస్తోంది. నిడమర్రు మండలం అడవికొలను గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని చేపల చెరువు తవ్వుకున్న వ్యక్తులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. అడవికొలనులోని తిమ్మారావుగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 148 నుంచి 163 సర్వే నెంబర్లలో దాదాపు 70 ఎకరాల చేపల చెరువు ఉంది. ఈ చేపల చెరువులో సర్వే నెంబర్ 159-4 సర్వే నెంబర్‌లో పంట బోదెకు చెందిన 94 సెంట్ల భూమి ఉంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి దర్జాగా చేపల చెరువు తవ్వేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ ఈ చెరువుపై ఫిర్యాదులు రావడంతో నిలుపుదల చేశారు. దాదాపు రెండేళ్లకుపైగా ఆ చెరువు తవ్వకం నిలిచిపోయింది. తర్వాత వివిధ రకాల ఎత్తుగడలతో చేపల చెరువు తవ్వేశారు. చెరువులోని ప్రభుత్వ భూమికి ఏడాదికి ఎకరాకు రూ.లక్ష వరకూ లీజు వస్తోంది. అంటే ప్రభుత్వ భూమి 94 సెంట్లు ఆక్రమించి పదేళ్లలో దాదాపు రూ.పది లక్షలు సొమ్ము ఆర్జించారు. ఇంతటితో ఆగలేదు. 70 ఎకరాల చేపల చెరువుకు పక్కనే ఉన్న పలువురు చిన్నకారు రైతులు తవ్వుకున్న ఆరెకరాల చేపల చెరువును తమ చెరువులో కలిపేసుకునేందుకు కుట్రలు పన్నారు. తప్పుడు ఫిర్యాదులు చేసి సాగు చేయకుండా చేశారు. సంబంధిత రైతులు ప్రశ్నించడంతో 70 ఎకరాల చేపల చెరువులోని కబ్జా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో మండల రెవెన్యూ అధికారులు తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి చేపల చెరువులో ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు భూమికి సంబంధించిన హద్దులను సైతం నిర్ణయించారు. ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని చేపల చెరువు సాగు చేసుకుంటున్నామని చెరువుకు సంబంధించిన వారే అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం (పిజిఆర్ఎస్)లో రాతపూర్వకంగా అంగీకరించి ఇచ్చారు. అంతేకాకుండా చెరువులో లేని వ్యక్తి పేరున కరెంటు కనెక్షన్ కొనసాగిస్తూ ప్రభుత్వ సబ్సిడీ సైతం అనుభవిస్తున్నట్లు వారే అధికారులకు రాతపూర్వకంగా ఇచ్చిన పరిస్థితి ఉంది. తాము ప్రభుత్వ భూమి ఆక్రమించి చేపల చెరువు తవ్వకం సాగించామని, విద్యుత్ కనెక్షన్ కొనసాగిస్తున్నామని వారే ఒప్పుకున్న పరిస్థితి. దీనిపై మరిన్ని ఫిర్యాదులు అధికారులకు వెళ్లడంతో ప్రభుత్వ భూమి ఆక్రమించి తవ్విన చేపల చెరువుకు అధికారులు నోటీసులు జారీ చేశారు. రాష్ట్రస్థాయి మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల నుంచి రెండు, మండల కమిటీ నుంచి ఒకటి, జిల్లా కమిటీ నుంచి రెండు నోటీసులు ఇప్పటికే జారీ చేశారు. చేపలు పట్టుకునేందుకు జులై 30 వరకూ గడువు ఇవ్వాలని అక్రమ చేపల చెరువుకు సంబంధించిన వారు కోరడంతో అధికారులు అవకాశం ఇచ్చారు. గడువు ముగియడంతోపాటు చేపలు పట్టుకున్నారు. ఇప్పుడు అధికారులు రంగంలోకి దిగి తామే ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నామన్న చేపల చెరువును ధ్వంసం చేసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటారో, లేదో చూడాల్సి ఉంది. మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు చట్టప్రకారం ముందుకు సాగుతారా.. చట్టవిరుద్ధంగా నడిచి అధికార దుర్వినియోగానికి పాల్పడతారో వేచిచూడాలి.



చేపల చెరువులో ఆక్రమించుకున్న ప్రభుత్వ పంట బోదెకు హద్దులు నిర్ధారిస్తున్న అధికారులు

అక్రమాలకు కొమ్ముకాస్తున్న రాజకీయ నేతలు

ప్రభుత్వ భూమి కబ్జా చేసి చేపల చెరువు తవ్వారని గ్రామంలో అందరికీ తెలుసు. అక్రమ పద్ధతిలో విద్యుత్ కనెక్షన్ కొనసాగుతుందని తెలిసినప్పటికీ రాజకీయ నాయకులు అక్రమాలకు కొమ్ముకాస్తున్నారు. అక్రమమార్గంలో అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఏడాదిగా చేపల సాగు నిలిచిపోయిన రైతుల గురించి ఏమాత్రం ఆలోచించకుండా అక్రమంగా ముందుకు సాగుతున్నవారికి రాజకీయ నాయకులు అండగా నిలవడం చూసి అధికారులు, జనం సైతం విస్తుపోతున్నారు. చట్టం.. న్యాయం వంటి వాటికి తిలోదకాలు ఇచ్చేసి, తమవారు ఏం చేసినా కొమ్ముకాస్తాం అనే రీతిలో రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారా?

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ, ప్రయివేటు భూములు ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్-2024ను తీసుకొచ్చింది. ప్రభుత్వ, ప్రయివేటు భూములు ఆక్రమించినవారిపై ఫిర్యాదు అందితే అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సి ఉంది. భూములు ఆక్రమించుకున్నట్లు నిర్ధారణ అయితే ఈ చట్ట ప్రకారం పదేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని చేపల చెరువు తవ్వినట్లు చెరువుకు సంబంధించిన వారే రాతపూర్వకంగా ఒప్పుకున్న నేపథ్యంలో ల్యాండ్ గ్రాబింగ్ చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఫిర్యాదులు సైతం అందాయి. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని అధికారులు అమలు చేస్తారో లేదో కూడా చూడాలి.

'స్త్రీ శక్తి' అమలుకు సర్వం సిద్ధం

- 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- 4 డిపోల నుంచి 223 బస్సులు నడిపేందుకు చర్యలు
- బస్టాండ్లలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి
- జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం





కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ (స్త్రీ శక్తి) పథకం అమలుకు సంసిద్ధంగా ఉన్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ తెలిపారు. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 223 బస్సులు మహిళల ఉచిత ప్రయాణానికి నడిపేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా బస్టాండ్లలో మరుగుదొడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు వివరించారు. జిల్లాలో ఆర్‌టిసి బస్సులు 33 ప్రధాన రూట్లలో రోజుకు లక్ష కిలోమీటర్ల వరకూ రాకపోకలు సాగిస్తున్నాయని, 82 వేల మంది ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. సగటున రూ.38 లక్షల వరకూ ఆదాయం లభిస్తోందన్నారు. జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాట్ల వివరాలను జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి వరప్రసాద్ ప్రజాశక్తి ముఖాముఖిలో వెల్లడించారు.

ప్రశ్న: జిల్లాలో ఆర్‌టిసి డిపోలు ఎన్ని ఉన్నాయి? ఎన్ని బస్సులు ఉన్నాయి? ఎన్ని రూట్లలో నడుపుతున్నారు?

డిపిటిఒ: భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురంలో నాలుగు ఆర్‌టిసి డిపోలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రధానంగా 33 రూట్లలో బస్సులు తిరుగుతున్నాయి. 298 బస్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రయాణికుల అవసరం మేరకు బస్సులు నడుపుతున్నాం.

ప్రశ్న: రోజుకు ఎంతమంది ప్రయాణిస్తున్నారు? ఎంత ఆదాయం సమకూరుతోంది?

డిపిటిఒ: జిల్లావ్యాప్తంగా రోజుకు 82 వేల మంది ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. రోజుకు సగటున రూ.38 లక్షలు ఆదాయం సమకూరుతోంది. ఆదాయం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలుపై జిల్లాలో ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

డిపిటిఒ: ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి అన్ని చర్యలూ తీసుకున్నాం. బస్సుల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, మహిళలకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా అన్ని చర్యలూ చేపట్టి సంసిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం నిర్దేశించిన రోజు నుంచి బస్సులు నడిపేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం.

ప్రశ్న: ఉచిత బస్సు పథకానికి ఎన్ని బస్సులు కేటాయించారు?

డిపిటిఒ: జిల్లాలో 298 ఆర్‌టిసి బస్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఉచిత బస్సు ప్రయాణానికి 223 పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు కేటాయించాం. వీటితోపాటు అందుబాటులో ఉన్న 25 బడి బస్సులు కూడా వినియోగించేందుకు చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: మహిళా ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఏమైనా చర్యలు చేపట్టారా?

డిపిటిఒ: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఇప్పటికే అన్ని చర్యలూ చేపట్టాం. ముఖ్యంగా బస్టాండ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. మరుగుదొడ్లు, తాగునీరు, ఫ్యాన్లు వంటి సౌకర్యాలు కల్పించడమే కాకుండా ఎటువంటి అసౌకర్యానికీ గురికాకుండా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: ఉచిత ప్రయాణానికి మహిళలను ఎలా అనుమతిస్తారు?

డిపిటిఒ: బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు మహిళలు ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఐడి ప్రూఫ్‌గా చూపించాల్సి ఉంటుంది. ఈ పథకం అమలులో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు ప్రభుత్వం మహిళా కండక్టర్లకు బాడీ కెమెరాలు, బస్సుల్లో సీసీ కెమెరాలు అమర్చనుంది. తద్వారా మహిళల, బాలికల భద్రతకు పెద్దపీట వేయనున్నట్లు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కె.పార్థసారథి ఇటీవల వెల్లడించారు.

ప్రశ్న: కళాశాల విద్యార్థినులకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందా?

డిపిటిఒ: హైస్కూల్ విద్యార్థినులకు ఇప్పటికే ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. కళాశాల విద్యార్థినులకు నామమాత్రపు ఛార్జీతో బస్సు పాస్‌లు అందించి ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఈ పథకం అమలు నేపథ్యంలో కళాశాల విద్యార్థినులకు కూడా ఉచిత ప్రయాణం వర్తిస్తుంది. ఎటువంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదు.

ప్రశ్న: జిల్లాలో కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బంది కొరత ఉందా?

డిపిటిఒ: జిల్లావ్యాప్తంగా 900 మంది కండక్టర్లు, డ్రైవర్లు ఉన్నారు. అలాగే ఇతర సిబ్బంది మరో 300 మంది వరకూ ఉన్నారు. అవసరానికి తగ్గట్టుగా ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు. ఉచిత ప్రయాణానికి సంబంధించి డ్రైవర్లు, కండక్టర్లను సిద్ధంగా ఉంచాం.

జిల్లాలో పలు చోట్ల వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం వరకు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ఎండవేడిమికి అల్లాడిన ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిలవడంతో గోతులు గుర్తించలేక వాహనదారులు ప్రమాదాల బారినపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. మొగల్తూరు నుండి వెంప వెళ్లే రహదారి మడుగును తలపించింది. మొగల్తూరులోని గొల్లగూడెం, వేటపాలెం, ముక్కువారి వీధి, వడయార్‌పేట, హైస్కూల్ వీధి, అగ్రహారం, పేరుపాలెం, కెపి పాలెం, కాళీపట్నం, పాతపాడు, ముత్యాలపల్లి, వారతిప్ప, మోడీ, రామన్నపాలెం తదితర గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రహదారులపై నిలిచిన వర్షపు నీటితో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు రహదారులపై నిలిచిన వర్షపు నీటిని బయటికి వెళ్లేలా వెంటనే చర్యలు చేపట్టాలని జనం కోరుతున్నారు.

పాలకొల్లు : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. నాలుగు రోజులుగా ఏదో సమయంలో వర్షం పడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి వాతావరణం తెలుపు ఇచ్చింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


మొగల్తూరులోని గొల్లగూడెంలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

అత్తిలి మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణస్వీకారం

జగన్ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారు : ఎంఎల్ఎ రాధాకృష్ణ


ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - అత్తిలి (తణుకు)

అధికార దాహంతో ఐదేళ్లలో అన్ని వర్గాలనూ అణగదొక్కిన జగన్మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలపై దాడులు చేయించారని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అత్తిలి మార్కెట్ కమిటీ నూతన ఛైర్మన్‌గా దాసం ప్రసాద్, వైస్ ఛైర్మన్ కడలి రామాంజనేయులుతోపాటు కమిటీ సభ్యులు ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. అత్తిలి మార్కెట్ యార్డు కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఎల్ఎ రాధాకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తును సర్వనాశనం చేసిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. ప్రధాని మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూటమిగా ఏర్పడి రాష్ట్రంలో దుర్మార్గ పాలనను తరిమికొట్టడంతోపాటు రాష్ట్ర పునర్నిర్మాణానికి బాట వేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ సంక్షేమం, అభివృద్ధి ఏకకాలంలో అమలు చేస్తున్నారని తెలిపారు.

సిగ్గులేని వైసిపి నేతలు ఎంఎల్ఎ బొలిశెట్టి

మరోసారి జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని భావించిన ప్రజలు కూటమికి అధికారం కట్టబెట్టారని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. దొంగలుగా నిరూపణ అయ్యాక కూడా సిగ్గు లేకుండా వైసిపి నాయకులు రోడ్డెక్కి మాట్లాడుతున్నారని విమర్శించారు. రూ.కోట్ల మేర ప్రజాధనం దోచుకున్నారని విమర్శించారు.

రైతులకు అండగా ఉంటా : దాసం ప్రసాద్

అత్తిలి మండలంలోని రైతులకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ వారికి ఏ కష్టం వచ్చినా ఎంఎల్ఎ రాధాకృష్ణ సహకారంతో తన వంతు సహకారం అందిస్తానని నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన అత్తిలి ఎఎంసి ఛైర్మన్ దాసం ప్రసాద్ తెలిపారు. రైతులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఈ పదవి స్వీకరించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పీతల సుజాత, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, తణుకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ దొమ్మేటి వెంకట సుధాకర్, తణుకు ఎఎంసి ఛైర్మన్ కొండేటి శివ పాల్గొన్నారు.

సాగర తీరాన పర్యటకుల సందడి

అలల ఉధృతితో స్నానాలకు అనుమతించని పోలీసులు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం సౌత్, కెపి.పాలెంసౌత్ గ్రామాల్లోని బీచ్‌కు పర్యాటకులు ఆదివారం తరలివచ్చారు. ఒకవైపు నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా బీచ్‌కు పర్యాటకుల రాక కొనసాగింది. అయితే వాతావరణ మార్పులతో సముద్రపు అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఎస్ఐ జి.వాసు పర్యవేక్షణలో సిబ్బంది పర్యాటకులను స్నానాలకు అనుమతించలేదు. దీంతో పర్యాటకులు ఆటపాటలతో గడిపారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సహపంక్తి భోజనాలు చేశారు.


తీరంలో పర్యాటకులు

అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించాలి

ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు కృషి చేయాలి

యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అమరులు అప్పారి వెంకటస్వామి, రామిరెడ్డి, ఎస్ఆర్ పోలిశెట్టి స్ఫూర్తితో ఉద్యమాలు సాగించాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. భీమవరంలో యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పతాకాన్ని ఎంఎల్‌సి గోపీమూర్తి ఎగరవేసి మాట్లాడారు. 1974 ఆగస్టు 10న యుటిఎఫ్ ఆవిర్భావం జరిగిందన్నారు. ఎంతోమంది అమరులు సంఘాన్ని బలపరచడంలో విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ముఖ్యంగా అన్ని సంఘాలలో మొనగాడు సంఘంగా తీర్చిదిద్దటంలో అమరులు చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఎన్నో రకాల ప్రయోజనాలు సాధించారన్నారు. ప్రస్తుతం ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వ విద్యా పరిరక్షణకు పాటుపడాలన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు సిహెచ్.ప్రసాద్‌రావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, సిహెచ్.కుమార్ బాబ్జి, డి.యేసు బాబు, జిల్లా కౌన్సిలర్ బిజెవిడి.రాజ్యలక్ష్మి, ఆడిట్ మెంబర్ జి.అబ్రహం, పాలకోడేరు మండల అధ్యక్షులు పివి.రమణ రాజు, ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, కాళ్ల మండల అధ్యక్షులు స్వామి, ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, భీమవరం పట్టణ అధ్యక్షులు కె.మల్లేశ్వర రావు, భీమవరం రూరల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరసింహయ్య, నాగ బాబు, గణపవరం మండల ప్రధాన కార్యదర్శి జి.భవాని ప్రసాద్ పాల్గొన్నారు.


భీమవరంలో.. జెండా ఎగురవేస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

నరసాపురం : యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం యుటిఎఫ్ నాయకులు యుటిఎఫ్ భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో సంఘం జెండాను సీనియర్ నాయకులు వై.స్వామి నాయుడు, పూర్వపు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.మార్కండేయులు ఆవిష్కరించారు. సమావేశంలో ముందుగా అమరులైన ఉద్యమ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించి వారి సేవలను కొనియాడారు. జిల్లా ఆడిట్ సభ్యులు జిఎస్ఎస్ఆర్.స్వామి, నరసాపురం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌వి.సత్యన్నారాయణ, ఎస్.అజయ్ కుమార్, మండల శాఖ గౌరవ అధ్యక్షులు పి.శాంసన్, మండల సహాధ్యక్షులు ఎన్.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గణపవరం : యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం యుటిఎఫ్ గణపవరం మండల కమిటీ ఆధ్వర్యాన సరిపల్లి రెండవ పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు బి.రమేష్, ప్రధాన కార్యదర్శి భవానీప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎస్.రత్నంరాజు, నాయకులు శర్మ, మద్దాల వెంకటేశ్వరావు, మూరా చిన్న ఏసు పాల్గొన్నారు.

వీరవాసరం : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుక ఆదివారం వీరవాసరం యుటిఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జివివి.రామానుజరావు పతకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక అవసరంగా 1974లో ఏర్పడిన సంఘం ఈరోజు అనేక మంది నాయకులను తయారు చేసి విలువలకు, సామాజిక న్యాయానికి అండగా నిలుస్తుందన్నారు. అవినీతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తూ ఉపాధ్యాయులు, అధికారుల మన్ననలను పొందుతూ పెద్ద సంఘంగా ఎదిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎన్.ప్రసాదబాబు, ప్రధాన కార్యదర్శి ముద్రగళ్ల శ్రీనివాసరావు, డి.పుల్లారావు, కె.నాగమునేశ్వరావు, సాయిబాబు, బి.అచ్చియ్య, త్రిమూర్తులు, ఎన్.దుర్గారావు, ఎస్.శ్రీరాంచంద్రమూర్తి, ఆది సత్యనారాయణ పాల్గొన్నారు.


వీరవాసరంలో..


గణపవరంలో..


నరసాపురంలో..

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్

ప్రజాశక్తి - ఆచంట


అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పిస్తున్న సిపిఎం నాయకులు

అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. మండలంలో పెనుమంచిలి, ఆచంట వేమవరం, గ్రామాల్లో ఆదివారం అమరవీరులు నార్గన నరసింహమూర్తి, పంది నరసింహమూర్తి, కరుటూరి సత్యనారాయణ వర్ధంతి సభ సిపిఎం మండల శాఖ కార్యదర్శులు సిర్రా నరసింహమూర్తి, గుత్తుల రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆచంట వేమవరం గ్రామంలో కరుటూరి సత్యనారాయణ స్థూపం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ పార్టీ జెండా ఆవిష్కరించారు. పెనుమంచిలి గ్రామంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తలుపూరి బుల్లబ్బాయి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన వర్ధంతి కార్యక్రమంలో గోపాలన్ మాట్లాడుతూ ప్రజలపై భారాలు మోపే పాలకవర్గాల నుంచి ప్రజలను విముక్తి చేయడానికి ప్రజా పోరాటాలను ఉధృతం చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. హిందుత్వం పేరుతో పాలకులు ప్రజాస్వామ్యాన్ని అపహాసం చేస్తూ ప్రజల సంపదను కార్పొరేట్ కంపెనీలు లూటీ చేసేందుకు వీలు కల్పిస్తున్నాయని మండిపడ్డారు. దీనిలో భాగంగానే కార్పొరేట్ కంపెనీలకు అత్యంత విలువైన వ్యవసాయ భూములు అప్పనంగా కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. విద్యుత్ భారాలు ప్రజల్ని ఇక్కట్లకు గురిచేస్తున్నాయని, స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని ప్రచారం చేపట్టిన ప్రభుత్వ నేతలు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తూ ప్రజలను దగా స్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రాభివృద్ధిని, ప్రజా సమస్యలను ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని, బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ భూములను కారు చౌకగా కట్టబెట్టి దోచుకోవడానికి ఎంత తొందరగా అనుమతులు ఇవ్వాలన్న ధ్యాస తప్ప మరో పని లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటం చేసే పార్టీకి ప్రజలంతా అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నెక్కంటి కృష్ణమూర్తి, పిచ్చెటి సత్యనారాయణ, కొండేటి సత్యనారాయణ, గేద్దాడ త్రిమూర్తులు, రాపాక సత్యనారాయణ, మైలే వెంకట్రావు, జిల్లెల్ల కృష్ణమూర్తి, సిర్రా విగ్నేశ్వరుడు, మానుకొండ వీర్రాజు, వర్ధనపు శ్రీరాములు, నార్గన నరసింహమూర్తి కుమారులు విజయ్, శ్రీనివాసరావు, కరుటూరి సత్యనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించరూ..

సిద్ధాంతం హైస్కూల్ ప్లస్ విద్యార్థుల ఇబ్బంది

నియమించాలని వేడుకోలు

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

మండలంలోని సిద్ధాంతం గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్‌లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్కూల్లో ప్రస్తుతం ఇంటర్ విద్యను 35 మంది విద్యార్థులు అభ్యసిస్తుండగా 10వ తరగతి వరకూ 400 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వీరంతా పేద, దిగువ, మధ్యతరగతికి చెందిన విద్యార్థులే. ఇంటర్ విద్యార్థులకు విద్యను బోధించుటకు కామర్స్, ఫిజిక్స్, ఇంగ్లీష్ అధ్యాపకుల కొరత ఉండటంతో విద్యార్థులు ఈ సబ్జెక్టుల్లో సంపూర్ణ విద్యను పొందలేకపోతున్నారు. అటు పాఠశాల విద్యార్థులకు పిజిటి, పిటిలను అపాయింట్మెంట్ చేయవలసిందిగా కోరుతున్నారు. ఈ పాఠశాలలోని పలువురు విద్యార్థులు క్రమశిక్షణ రాహిత్యంగా ప్రవర్తిస్తూ పాఠశాలకు సక్రమంగా హాజరు కావడం లేదని, ప్రభుత్వం దృష్టికి ఈ విషయాలను చేర్చవలసిందిగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

రైస్‌మిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు

ప్రజాశక్తి - పెంటపాడు

రైస్‌మిల్ కార్మికులకు సరైన వేతనాలు లేక వారి కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని, వారి సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు అన్నారు. ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ఆదివారం కొలుకుల రమేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి చింతకాయల బాబురావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరుపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ సంవత్సరంలో సార్వా, దాల్వా రెండు సీజన్లో పనులు నాలుగు మాసాలు కూడా ఉండడం లేదన్నారు. దీనికి కారణం యంత్రాలు ఆధునికీకరణ చేయడం వల్ల ఎక్కువ మంది కూలీలతోనే తక్కువ రోజులు పనిచేస్తున్నారని, మిగిలిన కాలంలో వారు బతుకు తెరువు కోసం దూర ప్రాంతాలకు పనుల కోసం వెళుతున్నారని వారు తెలిపారు.



మాట్లాడుతున్న చింతకాయల బాబురావు

రైస్‌మిల్ కార్మికులకు సరైన వేతనాలు లేక వారి కుటుంబాలు పోషించడమే కష్టంగా ఉందని వారు తెలిపారు. ఒక పక్క నిత్యావసర వస్తువుల ధరలు, కరెంట్ ఛార్జీలు, విద్యా, వైద్యం అన్నీ కూడా ఈ కార్మికులకు అందుబాటు లేకుండా ఉన్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో వారు కుటుంబాలు పోషించుకోవడమే కష్టంగా ఉందని తెలిపారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతున్న వేతన ఒప్పందంకి కాల పరిమితి గత మార్చి 31వ తేదీతో ముగిసిందని, ఈ నాలుగు నెలలు దప దపాలుగా చర్చలు జరుపుకున్నప్పటికీ పరిష్కారం కాలేదని వారు తెలిపారు. రైస్‌మిల్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటీ వంటి పథకాలు కూడా కొన్ని రైస్ మిల్‌లో అమలు కావట్లేదని, అమలు కానీ రైస్ మిల్లుల యజమానులు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా కొలుకుల రమేష్, వల్లూరి శ్రీను, ఆరుగురుతో కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ భవిష్యత్తులో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ సమస్యల మీద పనిచేయాలని వారు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ కార్మికులు పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం అందజేత

పాలకొల్లు : పాలకొల్లు పట్టణ వాసులు శింగవరపు సోమేశ్వరావు మనవడు శింగవరపు లోకనందన్ గత కొన్నిరోజులుగా బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతూ విశాఖ(అగనంపూడిలో) ఓమీ బాబా కేన్సర్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. దాని నిమిత్తం హాస్పిటల్లో చాలా ఖర్చవుతుంది. సోమేశ్వర రావు సామాన్య మధ్యతరగతి కుటుంబీకుడు. ఆర్థికంగా సహాయం చేయమని సంఘ సభ్యులను అభ్యర్థించారు. పది మందికి ఉపయోగపడే సోమేశ్వరరావు ఈరోజున చాలా బాధల్లో ఉన్నారు. దీంతో జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యుల ద్వారా ప్రతి నెల క్రమం తప్పకుండా చేస్తున్న సామాజిక సహాయ సేవ కార్యక్రమంలో భాగంగా ఈనెలకు రూ.12 వేల ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ యువసేన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గెడ్డం సునీల్ గవాస్కర్, ఉపాధ్యక్షులు బుంగ సంసోన్, గౌరవ అధ్యక్షులు మానవతావాది భవానీ ప్రసాద్ రాయపూడి, కవి పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి : సిఐ


తాడేపల్లిగూడెం : స్థానిక ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం బొలిశెట్టి సేవా సమితి సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టౌన్ సిఐ ఆది ప్రసాద్, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ ఆది ప్రసాద్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సమాజంలో స్ఫూర్తివంతమైన పాత్ర పోషించాలన్నారు. అన్ని దానాలలో అన్నదానం గొప్పదని, ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి గౌరవ అధ్యక్షులు మత్తు బాబ్జి, అధ్యక్షులు లింగం శీను, కార్యదర్శి కేశవభట్ల విజయ్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సహాయకులను విధుల్లోకి తీసుకోవాలి

భీమవరం టౌన్ : రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో ఆరోగ్య సహాయకులను ఉద్యోగాల నుంచి తొలగించి తొమ్మిదో నెలొచ్చింది. ఈ నవమాసాలూ కష్టాలను, కన్నీళ్లనూ తమ కడుపులోనే దాచుకొని అష్టకష్టాలతో బ్రతుకీడుస్తున్న తమను కూటమి ప్రభుత్వం పునర్నియామకం చేయాలని ఆరోగ్య సహాయకులు కోరుతున్నారు. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జివివి.ప్రసాద్ కూటమి నేతలకు కన్నీటి లేఖలు రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను భీమవరంలో ఆయన వెల్లడించారు. గత డిసెంబర్ 5న అధికారులు హడావిడిగా తొలగించిన రాష్ట్రంలోని 920 మంది ఆరోగ్యసహాయకుల కుటుంబాల ఘోర పరిస్థితిని వివరిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు మొత్తంగా కూటమి ప్రభుత్వ నేతలకు లేఖలు రాసానని ప్రసాద్ వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తూ వాటిని కోల్పోయిన వారంతా యాభై ఏళ్ల వయస్సు పైబడ్డ వారేనని, ఈ వయస్సులో ఏళ్ల తరబడి నమ్ముకుని చేస్తున్నా ఉద్యోగం ఉన్న పళంగా పోతే వారి మీద ఆధారపడ్డ కుటుంబాలు, వృద్ధులైన తల్లిదండ్రులు గత ఎనిమిది నెలలుగా చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారన్నారు. తిరిగి అందరినీ త్వరితగతిన నియమించాలని విన్నవించారు.

కొవ్వలిని కలిసిన ఎఎంసి ఛైర్మన్ విజయభాస్కర్


ప్రజాశక్తి - నరసాపురం


కొవ్వలికి మొక్క అందిస్తున్న విజయ భాస్కర్

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడుని ఇటీవలే నూతనంగా నియమితులైన పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్ కోడే విజయభాస్కర్ ఆదివారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని కొవ్వలి నాయుడు దుస్సలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాలలో టిడిపి బలోపేతానికి అందరూ ఐక్యంగా కృషిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సంకు భాస్కర్ నాయుడు, చామకూరి బ్రదర్స్, లక్కు శ్రీను, బండారు మోహన్, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యువకులకు అభినందన

ప్రజాశక్తి - భీమవరం టౌన్


యువకులను అభినందిస్తున్న ఎంఎల్ఎ

ఇటీవలి విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో విజయం సాధించిన తుందుర్రు, జొన్నల గరువు గ్రామలకి చెందిన ముగ్గురు యువకులను ఎంఎల్ఎ, ప్రజా పద్ధతి కమిటీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అభినందించారు. తుందుర్రు ఎంపిటిసి ఆరేటి వాసు ఆధ్వర్యాన భీమవరం ఎంఎల్ఎ కార్యాలయంలో ఆదివారం అంజిబాబును కలిశారు. బొడ్డు రాజేష్, పాలపర్తి అరుణ్, పైడి బాల ఈ ముగ్గురు యువకులను ఎంఎల్ఎ సత్కరించి, అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని సూచించారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఇఎంసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట ప్రకారం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చారని, అలాగే పోలీసు శాఖలో కూడా భారీగా కానిస్టేబుల్ పోస్టులు తీశారన్నారు. దానిలో భాగంగా భీమవరం నియోజకవర్గంలోని తుందుర్రు, జొన్నల గరువు గ్రామం నుండి ఎంపికైన ముగ్గురిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపిరాజు, కోయ రమేష్, కొట్టు రవి, ఆరేటి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎల్‌బి చర్ల సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా వీరాస్వామి



నరసాపురం: మండలంలోని లింగనబోయిన చర్ల(ఎల్‌బి చర్ల) సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా టిడిపి నాయకులు గుబ్బల వీరాస్వామి నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా చామకూరి ఉషారాణి, పులపర్తి వెంకట సత్యనారాయణను నియమించడంపై గ్రామస్తులు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

గోపాలకృష్ణ సేవలు గొప్పవి

మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని

పెనుమంట్ర : మాజీ ఎఎంసి ఛైర్మన్‌గా, బిసి సంఘ నాయకునిగా సానబోయిన గోపాలకృష్ణ పార్టీకి, ప్రజలకు చేసిన సేవలు గొప్పవని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలం లోని మల్లిపూడి గ్రామంలో జరిగిన సానబోయిన సంస్మరణ కార్యక్రమం లో ఆయన పాల్గొని నివాళులు తెలిపారు. అనారోగ్యంగా ఉన్న తన గెలుపుకు ఎంతో కృషిచేశారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సానబోయిన పనిచేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు నివాళులు తెలుపుతూ మాట్లాడారు. టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు వెలగల బుల్లి రామిరెడ్డి, జి.మురళీ మోహన్, క్లస్టర్ కన్వీనర్ చింతపల్లి గోపాలకృష్ణ, జుత్తిగ సొసైటీ ఛైర్మన్ వీరవల్లి రాంబాబు, స్థానిక ప్రాముఖులు జి.సుందర రామిరెడ్డి, వీరవల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సాయి కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకొల్లు రూరల్ : మండలంలోని దిగమర్రు గ్రామానికి చెందిన చిరంజీవి అభిమాని ఈరనాల సాయి ఇటీవల గుండెపోటుతో మరణించాడు. తను చిరంజీవి అభిమానిగా ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. సాయి కుటుంబానికి పెదమామిడి పల్లి, దిగమర్రు మెగా పవర్ ఫ్యాన్స్ రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు చేతుల మీదుగా కుటుంబ సభ్యులు ఈర్నాల అనంతలక్ష్మికి రూ.4 వేల నగదు, బియ్యం, నూతన వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా తులా రామలింగేశ్వరరావు మాట్లాడుతూ పెదమామిడిపల్లి, దిగమర్రు గ్రామాలలో ఎప్పుడు ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా, ఎవరికైనా ఆర్థిక సహాయం అవసరమైనా వెంటనే స్పందించి మెగా పవర్ ఫ్యాన్స్ తరపున సహాయం చేయడం గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు పురస్కరించుకొని ముందుగానే ఈ అభిమాని కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిచ్చినందుకు చేబ్రోలు కృష్ణమోహన్, రాపాక నందియాను అభినందిస్తున్నామని, ముందు ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు కృష్ణమోహన్, రాపాక నందియా, కాలేపు చిట్టికాసులు, రాపాక నరేంద్ర, భావిశెట్టి సత్యనారాయణ, పెచ్చెట్టి రామకృష్ణ, పెచ్చెట్టి మురళీ, రాపాక ప్రభాకర్ రావు, అయిన పత్తి సతీష్, కొలుసు దుర్గాప్రసాద్, బాసిన రామ లింగయ్య, పెచ్చెట్టి పెద్ద సత్యనారాయణ, పెచ్చెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు సబ్ కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్


నరసాపురం : నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 11వ తేదీన సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. డివిజన్లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. సబ్ డివిజన్లోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో యథావిధిగా జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10:30 నుంచి అందించాలని కోరారు.

పెదపుల్లేరు సొసైటీ ఛైర్మన్‌గా గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి



పెదపుల్లేరు విశాల పరపతి సహకార సంఘం నూతన ఛైర్మన్‌గా గ్రామానికి చెందిన కలిదిండి గోపాలకృష్ణంరాజును నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది. పెదపుల్లేరు సొసైటీ పరిధిలో పెదపుల్లేరు, చిన్నపుల్లేరు గ్రామాలు ఉండగా సుమారు 2,400 మంది సభ్యులతో 30 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. గోపాలకృష్ణంరాజు సోదరులు సీతారామరాజు గతంలో సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించి బ్యాంకును లాభాల బాటలో నడిపించారు. అదేవిధంగా గోపాలకృష్ణంరాజు కూడా రైతులకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన సేవలను అందిస్తూ బ్యాంకును అన్ని విధాల లాభాల బాట పట్టించాలని పలువురు కోరుకుంటున్నారు. కమిటీ సభ్యులుగా జనసేన నాయకులు పాతూరి మోహన్, టిడిపి నాయకులు దొనబోయిన గంగరాజులను నియమించినట్లు ఆ ఉత్తర్వులో ప్రభుత్వం పేర్కొంది.


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

వేల్పూరు పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం

తణుకు : రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కృషిచేయాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. ఆదివారం మండలంలోని వేల్పూరు పిఎసిఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో సొసైటీల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సొసైటీ ఛైర్మన్‌గా పెనుమర్తి మోహన్, సభ్యులుగా వీరవల్లి ఆంజనేయులు, పెన్నాడ గణేష్‌లతో జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో వేల్పూరు మాజీ సర్పంచి పెనుమర్తి సోమసూర్యచంద్రరావు (దత్తుడు), ప్రస్తుత సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి, ఉప సర్పంచి గుణ్ణం రాజారావు, నాయకులు ఆరిమిల్లి రాము, చిట్టూరి సునంద, వల్లూరి రామ్‌మోహన్‌రావు, రెడ్డి నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కొప్పర్రు సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా నరేన్



నరసాపురం: మండలంలోని కొప్పర్రు సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా జనసేన నాయకులు అందే నరేన్ నియమితులయ్యారు. నరేన్ జనసేనలో పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్నారు. నరేన్ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు సెక్యూరిటీ కో ఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు. కమిటీ సభ్యులుగా కడలి మసీనురావు, మెరుగుమువ్వల భాస్కర రామస్వామిను నియమించడంపై గ్రామస్తులు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నరేన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ కొప్పర్రు సొసైటీ అభివృద్ధికి కృషి చేసి మంచి గుర్తింపు తీసుకు వస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నరేన్‌కు జనసేన సీనియర్ నాయకులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త పోలిశెట్టి శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు.


రామారావు



వెంకటేశ్వరరావు


ముత్యాలరావు

సొసైటీలకు త్రిసభ్య కమిటీలు నియామకం


మొగల్తూరు : మండలంలోని సొసైటీలకు త్రిసభ్య కమిటీలు నియామకం చేస్తూ ఆదివారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొగల్తూరు సొసైటీ ఛైర్మన్‌గా నిప్పులేటి తారక రామారావు, సభ్యులుగా మైలాబత్తుల రాంబాబు, కె.నాగేశ్వరరావు, కెపి పాలెంలోని వడ్లవానిపాలెం సొసైటీ ఛైర్మన్‌గా వలవల శేషారావు, సభ్యులుగా కె.సత్యనారాయణ, కోయి కృష్ణ, జగన్నాధపురం సొసైటీ ఛైర్మన్‌గా వేగేశ్న త్రినాధరాజు, సభ్యులుగా సుందర సత్యనారాయణ, కొల్లాటి శ్రీనివాసు, కాళీపట్నం సొసైటీ ఛైర్మన్‌గా జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, సభ్యులుగా రేవు వెంకటేశ్వరరావు, తణుకుల నరసింహస్వామి, పేరుపాలెం సొసైటీ ఛైర్మన్‌గా కవురు ముత్యాలరావు, సభ్యులుగా మండ నాగ సత్యనారాయణ, అందే సత్యనారాయణ నియమితులయ్యారు.


త్రినాధరాజు


శేషారావు

యండగండి రూరల్ బ్యాంక్ అధ్యక్షునిగా రవివర్మ

ప్రజాశక్తి - ఉండి


డిప్యూటీ స్పీకర్‌తో రవివర్మ

యండగండి విశాల పరపతి సహకార సంఘం త్రిసభ్య కమిటీ నూతన అధ్యక్షునిగా మంతెన రవివర్మ(వేణు)ని నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది. సుమారు 30 సంవత్సరాలు పాటుగా బ్యాంకు అధ్యక్షునిగా పనిచేసిన పివిఎల్.నరసింహరాజు బ్యాంకుకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో ఇప్పుడు నూతన అధ్యక్షునిగా నియామకమైన మంతెన రవి వర్మపై బాధ్యత మరింత పెరిగింది. యండగండి గ్రామ టిడిపి అధ్యక్షులు రవివర్మ కనుమూరి రఘురామకృష్ణరాజుకు అత్యధిక మెజార్టీ సాధించేందుకు కృషిచేశారు. యండగండి బ్యాంకు పరిధిలో యండగండి, ఉనుదుర్రు, పాందువ్వ కండ్రిక, పాలకోడేరు మండలంలోని మైపా, కోరుకొల్లు, ఎస్.కొండేపాడు గ్రామాలలోని రైతులకు సేవలందిస్తుంది. అదేవిధంగా సుమారు 2 వేల మంది సభ్యులను కలిగిన ఈ బ్యాంకు సుమారు రూ.34 కోట్ల డిపాజిట్లను కలిగి ఉంది. స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు సహకారంతో మంతెన రవివర్మ రైతులకు అందుబాటులో ఉంటూ ఆదర్శ పాలనను అందించాలని పలువురు కోరుకుంటున్నారు. త్రిసభ్య కమిటీ సభ్యులుగా ఉనుదుర్రు గ్రామ టిడిపి అధ్యక్షులు బండారు వీర రాఘవులు, కోరుకొల్లు గ్రామానికి చెందిన అన్నెపు అప్పారావులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

పిఎం లంక సొసైటీ ఛైర్మన్‌గా సూర్యారావు

ప్రజాశక్తి - నరసాపురం




మండలంలోని పిఎం లంక సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా జనసేన నాయకులు పులపర్తి సూర్యారావు నియమితులయ్యారు. ప్రస్తుతం సూర్యారావు జనసేనలో కొనసాగుతున్నారు. కమిటీ సభ్యులుగా కోడి వీర వెంకట సత్యనారాయణ, పొన్నమండ ముత్యాలరాజును నియమించడంపై గ్రామస్తులు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ పిఎం లంక గ్రామ వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘ అభివృద్ధికి కృషి చేసి, మంచి గుర్తింపు తీసుకు వస్తానని తెలిపారు.

కాళ్లకూరు సొసైటీ ఛైర్మన్‌గా ప్రణబ్ మూర్తి రాజు

ప్రజాశక్తి - కాళ్ల



కాళ్లకూరు సహకార బ్యాంకు ఛైర్మన్‌గా దండు ప్రణబ్ మూర్తి రాజు నియమితులయ్యారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన దండు ప్రణబ్ మూర్తిరాజు టిడిపి సీనియర్ నాయకులు. గత 40ఏళ్ల పాటు టిడిపిలోనే కొనసాగుతున్నారు. ఈయన తండ్రి దండు సత్యనారాయణరాజు గ్రామ సర్పంచిగా ఒక పర్యాయం, ఎంపిటిసిగా, కాళ్లకూరు సొసైటీ ఛైర్మన్‌గా ఒక పర్యాయం పనిచేశారు. ప్రస్తుతం కాళ్లకూరు సహకార బ్యాంకు ఛైర్మన్ పదవి వరించింది. త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనకు కూటమి నాయకులు, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఆమర మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.


కృష్ణంరాజు(బుజ్జి)


నాగరాజు


బల రామకృష్ణంరాజు


బాలాజీ రాజు

సొసైటీలకు త్రిసభ్య కమిటీలు నియామకం

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని నాలుగు వ్యవసాయ సహకార సంఘాలు(సొసైటీ)కు ఎట్టకేలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అప్పటి పాలకవర్గాలను రద్దుచేసి త్రిసభ్య కమిటీలను నియమించింది. ఇవి ఐదేళ్లపాటు కొనసాగాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వైసిపి నియమించిన త్రిసభ్య కమిటీలను రద్దు చేసింది. అయితే తర్వాత కూటమి ప్రభుత్వం ఎన్నికలు పెడుతుందని అంతా భావించారు. అయితే ఏడాది పూర్తయినా ఎన్నికలకు వెళ్లకుండా గత త్రిసభ్య కమిటీలను మళ్లీ తెరపైకి తీసుకువచ్చింది. దీనిలో భాగంగా మండలంలో ఉన్న నాలుగు వ్యవసాయ సహకార సంఘాలకు కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శృంగవృక్షం సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా కలిదిండి కృష్ణంరాజు(బుజ్జి), సభ్యులుగా కడలి రంగారావు, వీరవల్లి శ్రీనివాసకుమార్, పాలకోడేరు సొసైటీ ఛైర్మన్‌గా కొత్తపల్లి నాగరాజు, సభ్యులుగా యర్రా అప్పారావు, పాలా నాగ గంగాధరరావు, కుముదవల్లి ఛైర్మన్‌గా బుద్ధరాజు బలరామకృష్ణంరాజు, సభ్యులుగా పి.సూర్యారావు, భూపతిరాజు మధుమోహనరాజు, విస్సాకోడేరు సొసైటీ ఛైర్మన్‌గా నంబూరి వెంకట రామాంజనేయవర్మ(బాలాజీరాజు), సభ్యులుగా సంగారెడ్డి విజయలక్ష్మి, బైరెడ్డి శ్రీను ను నియమించారు. ఈ నాలుగు సొసైటీల ఛైర్మన్ పదవులను ఒకటి బిజెపికి, మరో మూడు టిడిపికి కేటాయించారు. అయితే సొసైటీలకు కమిటీలు ఏర్పాటు చేయడం పట్ల కూటమి నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ కెమెరాలు తొలగించండి

దళిత నేతల ధర్నా

ఉండి : పాములపర్రు గ్రామంలోని దళితవాడకు వెళ్లే ప్రాంతంలో అక్రమంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ దళిత నాయకులు ఆదివారం సీసీ కెమెరాల ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ కెమెరాలు గ్రామంలో ఏర్పాటు చేయడం మంచిదే కానీ ప్రస్తుత తరుణంలో కేవలం తమ ప్రాంతంలోకి వచ్చేవారిని గుర్తించడానికి ఏర్పాటు చేయడం సరికాదని అన్నారు. తమ స్వేచ్ఛకు విఘాతం కలిగించేలా కొందరు సీసీ కెమెరాలు అమర్చారని వీటిని స్వచ్ఛందంగా తొలగిస్తే మంచిదని లేని పక్షంలో తామే తొలగిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దానం విద్యాసాగర్, దర్శి సాల్మన్‌రాజు, మహిళలు ఉన్నారు.


నిరసన తెలుపుతున్న దళితులు